చెట్లను కొట్టేస్తున్నారు..

నాడు హరితహారం.. నేడు కాసుల బేరం

- హోర్డింగుల కోసం ఆకుపచ్చని చెట్ల తొలగింపు
- ఆర్ అండ్ బీ శాఖ అధికారుల నిర్వాకం
- మా చెట్లను తొలగిస్తున్నారు : మున్సిపల్‌శాఖ

నాడు ఏపుగా పెంచిన మొక్కలు

నేడు మొక్కలు తొలగించి లాలీపాప్ హోర్డింగులను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మణికొండ, జనవరి 23: హరిత తెలంగాణే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు కృతనిశ్చయంతో కోట్లాది మొక్కలు నాటింది. వాటి సంరక్షణ కోసం అనేక చర్యలు చేపట్టింది. ఎక్కడ చూసినా.. రహదారుల మధ్య ఆకుపచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తున్న విషయం తెలిసిందే. కానీ, ఇటీవల అధికారంలోకి వచ్చిన కొత్త సర్కారు ఆకుపచ్చని చెట్లను తొలగించి.. ప్రైవేట్ వ్యక్తుల హోర్డింగుల కోసం రహదారుల మధ్యలో ఏడారిని తలపించేలా చర్యలు చేపడుతుండటంపై వాహనదారులు భగ్గుమంటున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, గండిపేట చౌరస్తా నుంచి ఖానాపురం వరకు రేడియల్ రోడ్డు మధ్యలో అప్పటి సర్కారు ఆకుపచ్చని మొక్కలను నాటడంతో.. అవి ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే, ఇటీవల సర్కారు మారడంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇప్పుడు ఆ చెట్లను తొలగించి ప్రైవేటు వ్యక్తులు హోర్డింగులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇస్తున్నారు. అవి అన్నీ నిబంధనలకు వ్యతిరేకంగానే ఏర్పాటు చేస్తుండటంపై నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడువందల మీటర్లకు ఒక హోర్డింగు పెట్టాలని కచ్చితమైన నిబంధనలు ఉన్నా.. అవేమీ పట్టనట్లుగా కాంట్రాక్టర్లు ఐదు అడుగుల దూరంలో లాలీపాప్ హోర్డింగులను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆకుపచ్చని అందాలతో నిత్యం ఆహ్లాదాన్ని అందించే రహదారులిప్పుడు ఏడారిలో అద్దాలను ఏర్పాటు చేసినట్లుగా దర్శనమిస్తున్నాయి. చాలా చోట్ల పెద్ద హోర్డింగులను కూడా అదేవిధంగా ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఏర్పాట్లను చూస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం చేసేదేమీ లేక చేతులెత్తేశారు. మూడేళ్లుగా మొక్కలను నాటి.. ఏపుగా పెంచిన తర్వాత ఆర్ అండ్ బీ శాఖ అధికారుల అనాలోచిత వ్యవహారంతో చెట్లను తొలగిస్తున్నారంటూ మండిపడుతున్నారు.

నిబంధనలను పట్టించుకునేదెవరూ..!

నిబంధనలకు విరుద్ధంగా నార్సింగి మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న లాలీపాప్ హోర్డింగులపై చర్యలు తీసుకునేదెవరంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపట్టిన ఆర్ అండ్ బీ అధికారులకు ఇక్కడ అనుమతులిచ్చే అధికారమెక్కడిదంటూ మున్సిపాలిటీ వాసులు ప్రశ్నిస్తున్నారు. రోజూ ప్రమాదాలు జరుగుతున్నా.. అవేమీపట్టనట్లుగా రాత్రివేళ విద్యుత్ లైట్లతో జిగేల్‌మంటుండటంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇదిలావుండగా.. స్థానిక మున్సిపాలిటీ నిధులతో పెంచిన మొక్కలను తొలగించడంతో పాటు అడ్డగోలు అనుమతులను ఎలా ఇచ్చారంటూ ఆర్ అండ్ బీ అధికారులను పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం ఈ వ్యవహారాలపై స్పందించకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రజకులకు టికెట్లు ఇవ్వాలి

ఖైరతాబాద్, జనవరి 23 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంబీసీలకు సముచిత స్థానం కల్పించాలని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ ఎన్. శ్రీనివాస్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కరీంనగర్ లేదా ఖమ్మం స్థానం నుంచి విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా ఎదిగిన హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాదగిరికి టికెట్ కేటాయించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఖైరతాబాద్, జనవరి 23 : ఖైరతాబాద్‌లోని ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల నూతన సంవత్సర డైరీని మంగళవారం కళాశాల చైర్మన్ విశ్వనాథం, ప్రిన్సిపాల్ కూర రఘువీర్, పూర్వ ప్రిన్సిపాల్ పూర్ణచంద్‌ర్‌తో కలిసి ఆవిష్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్, జనవరి 23: శ్రీకృష్ణ భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ధ్వజాజీ ఆనంద్ ఉత్సవ్‌ను ఈ నెల 26 నుంచి నగరంలో కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు శ్రీనాథ్‌జీ ధ్వజా జీ ఆరోహన్ ఉత్సవ్ సమితి ట్రస్టీ రూపేశ్ వైషా తెలిపారు. జనవరి 26 నుంచి 28 వ తేదీ వరకు నెక్లెస్ రోడ్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను, పుస్తకాన్ని సమితి ట్రస్టీ ప్రతినిధులు ఆవిష్కరించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

పేదింటి ఆడబిడ్డలకు వరం..

- ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, జనవరి 23: పేదింటి ఆడ బిడ్డలకు వరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని వైఎన్ఆర్ గార్డెన్‌లో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేసీఆర్ సారథ్యంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన చెక్కులను పంపిణీ చేశామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 203 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాల డంపింగ్.. రూ.25 వేల ఫైన్

బండ్లగూడ, జనవరి 23: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఖాళీ స్థలాలలో భవన నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేసే వారికి జీహెచ్ఎంసీ అధికారులు వణుకు పుట్టిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ సహకారంతో వ్యర్థాలను డంపింగ్ చేసే వారికి అధిక మొత్తంలో జరిమానాలు విధిస్తున్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించారు. వ్యర్థాలు డంపింగ్ చేసేందుకు వచ్చిన లారీలను పట్టుకుని, జరిమానాలు విధించారు. సోమవారం రాత్రి కూడా శివరాంపల్లి నవాబ్‌సాబ్‌కుంట వద్ద డంపింగ్ కోసం వచ్చిన రెండు లారీలను పట్టుకుని, వారికి రూ. 25 వేల జరిమానా విధించినట్టు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు.

విద్యార్థినులకు బంగారు పతకాలు

వెంగళరావునగర్, జనవరి 23: ఖేల్ ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో శ్రీనిధి విశ్వభారతి విద్యార్థినులు తమ ప్రతిభను కనబర్చారు. ఎల్బీ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన జరిగిన పోటీల్లో 18 జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు శ్రీనిధి విశ్వ భారతి విద్యార్థినులు ఉన్నారు. అండర్ 12 టీమ్ విభాగంలో తన్వి, రాజేశ్వరి. హిమవర్షిత, ధన్విత గెల్చుకున్నారు. గోల్డ్ మెడల్‌తో పాటు బ్రాన్జ్ మెడల్ కూడా శ్రీనిధికి దక్కింది. గెలిచిన విద్యార్థినులను మంగళవారం పాఠశాల యాజమాన్యం సన్మానించి, అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు లక్ష్మణ్, కృష్ణవేణి, సుకుమార్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, పూర్ణిమ, అనితారావత్, కో- ఆర్డినేటర్ సాయిరాం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'మై అటల్ హు' చిత్రాన్ని వీక్షించిన గవర్నర్ దత్తాత్రేయ

ఖైరతాబాద్, జనవరి 23 : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని 'మై అటల్ హు' పేరుతో చిత్రీకరించిన బయోపిక్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లో కుమార్తె విజయలక్ష్మి, బీజేపీ శ్రేణులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1977లో తనకు వాజ్‌పేయితో పరిచయం ఏర్పడిందని, అనేక కార్యక్రమాల్లో ఆయనతో పాలుపంచుకున్నానని, రాజకీయాల్లో నైతిక విలువున్న మహోన్నత వ్యక్తి అని అన్నారు. నేటి తరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మల్లు రవికి శుభాకాంక్షలు..

జూబ్లీహిల్స్,జనవరి 23: మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లు రవిని ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించిన సందర్భంగా రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఖైరతాబాద్, జనవరి 23 : అయోధ్యలోని శ్రీ బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవంలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, యశోద దవాఖాన చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టి. దశరథరామారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం..

మణికొండ, జనవరి 23: విద్యార్థినులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. నేషనల్ గర్ల్ చైల్డ్ డేను పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారం, జ్ఞాన విజ్ఞానం, సెల్ఫ్ డిఫెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. తమకు నచ్చిన రంగాల్లో రాణించేందుకు స్వయం కృషి, పట్టుదలతో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వట్టినాగులపల్లి గ్రామంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖ

రోడ్డు పనులు ప్రారంభం

మణికొండ, జనవరి 23: గోపన్‌పల్లి నుంచి వట్టినాగులపల్లి అవుటర్ రింగ్‌రోడ్డు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులకు ఎట్టకేలకు మోక్షం కల్పించారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణంపై అనేక పర్యాయాలు స్థానిక ప్రజలు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి

బంజారాహిల్స్, జనవరి 23: మద్యం మత్తులో స్నేహితుడిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహ్మద్ షకీల్ చున్నాఖాన్ బతుకుదెరువు కోసం 9 నెలల కిందట నగరానికి వచ్చాడు. తనతో పాటు పనిచేసే మహేశ్‌తో కలిసి ఫిలింనగర్ సమీపంలోని మహాత్మాగాంధీనగర్‌లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి పీకలదాకా మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన మహేశ్ యాక్సా బ్లేడ్‌తో చున్నాఖాన్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

NOTICE
BEFORE THE HON'BLE NATIONAL COMPANY LAW TRIBUNAL HYDERABAD BENCH - 1
CP NO. 53/241/HDB/2022

Between:
M. Hanumantha Reddy,
Director of M/S. Aindhri Innovations Pvt. Ltd., H.No. 3-63, Vidhya Nagar Colony, Choutuppal, Choutuppal Mandal, Yadadri District - 508252, Telangana.
...Applicant

AND

1. **M/S. Aindhri Innovations Pvt. Ltd.,**
CIN No.u74999TG201PTC117237
Having Office at, 4th Floor, Apurupa LNG, Tollywood Building, H.No.8-2-293/82, Road No.78, Film Nagar, Jubilee Hills, Hyderabad.
... Respondent No. 1

2. **M. Lakshmi Narayana Pradeep**
Director of M/S. Aindhri Innovations Pvt. Ltd., Flat No. 202, 2nd floor, JVS Hitex Pride, Hitex Road, Shilpa Layout, Green Hamlet, Kothaguda - 500084, Telangana.
... Respondent No. 2

3. **Bank of Maharashtra**
Branch office: Kulkarni Building, 3/2/843, V.S. Road, Kachiguda, Hyderabad, 500027. Head Office: Lokmangal, 1501, Shivnagar, Pune, 411005.
... Respondent No. 3

As directed by the Hon'ble Hon'ble National Company Law Tribunal Hyderabad Bench-1, Respondent No.1 and 2 are hereby informed that the Applicant M. Hanumantha Reddy has filed Company Petition No. 53/241/HDB/2022 for oppression and mismanagement along with Interlocutory Applications vide I.A.191/2023, I.A.Nos.27/2023 and IA No.137/2023 for discovery of Original documents. As the notices sent earlier to R1 and R2 have been returned unserved with an endorsement "addressee left", the Hon'ble Tribunal on the request of the Applicant/petitioner vide its order dated 18.01.2024 has permitted for the issuance of Notice by way of publication for the appearance of Respondent No.1 and 2. The next date of hearing is on 29.02.2024. Hence this notice.

Sd/- **G.Anand Kumar**
Advocate
(M) 9849471079

అంగన్‌వాడీ కార్మికుల హామీలను అమలు చేయండి

హిమాయత్‌నగర్, జనవరి 23: తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీలను వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడం, పెన్షన్ రూ.10,000 ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.5లక్షలు, ఆయాలకు రూ.3లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాగేశ్వర్‌కు సన్మానం

బండ్లగూడ, జనవరి 23: అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ గ్రామం నుంచి కరసేవలో పాల్గొన్న వారిని గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేఎంసీ కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి మంగళవారం చింతల నాగేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమలో బాలరాజ్ ముదిరాజ్, విష్ణు, సంతోష్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ గర్ల్ చైల్డ్ డే వేడుకలు

జూబ్లీహిల్స్, జనవరి 23: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా షీ టీమ్స్ మంగళవారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల విద్య, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగర మహిళా భద్రత విభాగం జాయింట్ పోలీసు కమిషనర్ (క్రైమ్స్, సిట్) సంయుక్తాధ్వర్యంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవిత మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ బృందాలతో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్, జనవరి 23: మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ సైదులు, షేక్ బాదెమ్ బీ (39) బతుకుదెరువు కోసం ఏడేళ్ల కిందట నగరానికి వచ్చి, పద్మాలయ అంబేద్కర్ బస్తీలో ఉంటున్నారు. కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న బాదెంబీ సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటోలో ఫోన్ చోరీ

బంజారాహిల్స్, జనవరి 23: ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి మొబైల్‌ను తస్కరించారు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షేక్‌పేట సమీపంలోని కౌసర్ కాలనీ నివాసి షేక్ షాజహాన్ ఇటీవల రిపేర్‌కు ఇచ్చిన కారును తెచ్చుకునేందుకు షేరింగ్ ఆటోలో గచ్చిబౌలికి బయలు దేరాడు. ఆటో దిగిన తర్వాత చూసుకోగా.. తన రెడ్‌మీ 10 ఫోన్ కనిపించలేదు. ఆటోలో తనతో పాటు ప్రయాణించిన వారిలో ఎవరైనా తన ఫోన్ కొట్టేసి ఉంటారంటూ మంగళవారం షాజహాన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డలో నీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జనవరి 23: నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌లో మంగళవారం ఆయన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాగంటి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చాలా వెనుకబడి ఉన్న ఎర్రగడ్డ డివిజన్‌కు గత 9 ఏండ్లుగా అధిక ప్రాధాన్యతనిచ్చి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చటం జరిగిందన్నారు. ప్రతి బస్తీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, తాగునీటి పైపులైన్ల విస్తరణ చేపట్టామని ఆయన గుర్తు చేశారు. ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి.. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డి.సంజీవ, జావీద్, మజార్, గంట మల్లేశ్, ఎండీ సర్దార్, బాబూజానీ, యాదగిరి, రాము, రాంచందర్, దాసి శ్రీకాంత్, బాలకృష్ణ, తరుణ్, జహంగీర్, రూపేశ్, కల్యాణి, రమేశ్, సక్కుబాయి, జహంగీర్, నర్సింహ, దారాసింగ్, రహీం, అజీమ్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ యువతకు ఆదర్శప్రాయుడు

హిమాయత్‌నగర్, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శప్రాయుడని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేంపావని, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, నాయకులు షేక్ మహమూద్, అనిల్, జగన్, మురళీకృష్ణ, లక్ష్మణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సభ్యులు మురళీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.
- అత్తాపూర్, జనవరి 23: హైదర్‌గూడలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేశారు. ముఖ్య అతిథిగా అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత హాజరయ్యారు.

విద్యార్థులకు సన్మానం

అత్తాపూర్/బండ్లగూడ, జనవరి 23: విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొనప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం శివరామకృష్ణ అన్నారు. క్యాట్ (నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్ష) ఓలంపియాడ్ నిర్వహించిన పరీక్షలో అత్తాపూర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు 35 మంది పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచారు. ఈ సందర్భంగా నగదు బహుమతితో పాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను పొందారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అనిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.పుష్ప, డీన్ జ్ఞానేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, సి-బ్యాచ్ ఇన్‌చార్జి రమేశ్, శారధా మాత, మీనా తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి

ఖైరతాబాద్, జనవరి 23: పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన బావేశ్, నల్గొండకు చెందిన సబిత, సూర్యపేటకు చెందిన నాగమణి తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ కుటుంబ పెద్ద పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం చేస్తూ.. తమ జీవితాన్ని అంకితం చేశారని, వారు మరణిస్తే వారి వారసులుగా తమకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వడంలో దాట వేసే దోరణి కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు దారి చూపాలని కోరారు.

ఆత్మ విశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలి

కిక్ బాక్సింగ్‌లో మెడల్స్ సాధించిన గుత్తి సౌమ్యను అభినందిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 23: విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖేల్ ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్- 2024 పోటీల్లో పాయింట్ ఫైట్, కిక్ లైట్ పోటీల్లో మైలార్‌దేవ్‌పల్లికి చెందిన గుత్తి సౌమ్య ఒక బంగారు, ఒక సిల్వర్ మెడల్స్‌ను సాధించింది. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారిణి గుత్తి సౌమ్యతో పాటు కోచ్ నిఖేష్‌రెడ్డికి సర్టిఫికెట్లను అందజేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. క్రమ శిక్షణ, పట్టుదల ఉంటే తమ లక్ష్యాలను సాధించేందుకు సులభతరం అవుతుందన్నారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న కళ్యాణం

మణికొండ, జనవరి 23: నార్సింగిలో మల్లన్న స్వామి జాతర వైభవంగా జరుగుతోంది. మూడు రోజుల పాటు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో దేవాలయంలో మంగళవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరై మల్లన్న స్వామిని దర్శించుకొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ- బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్‌కుమార్, కిరణ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.